క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో డిజిటల్ విద్యాబోధన



డిజిటల్ విద్యాబోధన చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఆదినారాయణ

డెంకాడ: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో డిజిటల్ విద్యా బోధనకు ప్రిన్సిపాల్ మజ్జి ఆదినారాయణ శనివారం శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఐఎఫ్‌బీ ప్యానెల్ బోర్డుపై అధ్యాపకులు డిజిటల్ విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆదినారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనిలో భాగంగా డిజిటల్ విద్యా బోధన సౌకర్యం కల్పించారని చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో వరలక్ష్మి ప్రతిభ



వరలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

విజయనగరం: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం మహారాజా అటానమస్ కళాశాలకు చెందిన విద్యార్థి పి.వరలక్ష్మి ప్రతిభ కనబరిచింది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో విజయనగరం నుంచి పాల్గొన్న పి.వరలక్ష్మి డిస్క్ త్రోలో మొదటి స్థానం చేజిక్కించుకోగా... షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. అంతర్ కళాశాలల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారిణిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, కన్వీనర్‌లు, పీడీలు, అధ్యాపక సిబ్బంది శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా కావడి అట్టం



కావడి అట్టంలో పాల్గొన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దీక్షాపరులు

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి అట్టం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూల్‌బాగ్‌లో కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకట రమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులు కావడి పట్టుకుని స్వామివారిని స్తుతిస్తూ భజనలు చేశారు. ఆలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దారిపొడువునా కావడి మోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సారిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మజ్జి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ మజ్జి ఆదినారాయణ జ్ఞాపకార్థం అనిల్ నీరుకొండ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, సారిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్

నెల్లిమర్ల: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు శనివారం పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 19 వరకు పెన్‌డౌన్ కొనసాగుతుందన్నారు. సమగ్రశిక్ష సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో పాటు పలు రకాల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రమణ, రామకృష్ణ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంచారానికి చెక్

- రూ.5 లక్షలతో కొత్తపేట ప్రాంతంలో పశువుల కొట్టాం ఏర్పాటు
- విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



పశువుల కొట్టాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో విచ్చలవిడి పశువుల సంచారానికి చెక్ పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శనివారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 14వ డివిజన్ కొత్తపేటలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న పశువుల కొట్టాంనకు.. 20వ డివిజన్ కొత్తగ్రహారం ప్రాంతంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువల నిర్మాణ పనులను శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు, సూచనలతో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పశువుల కొట్టాం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తే వాటిని కొట్టాంకు తరలిస్తామని చెప్పారు. అదేవిధంగా రహదారులు, కాలువలు ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగ్రహారం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్ మాట్లాడుతూ, నగర ప్రజలు తెలియజేసిన సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించి మరింత మెరుగైన పాలనకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు ఘన స్వాగతం



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి రఘుబాబు, హౌసింగ్ డైరెక్టర్ శివారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సూరిబాబు, తదితరులు

భోగాపురం: మండలంలో జీఎంఆర్ సంస్థ చేపడుతున్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను శనివారం పరిశీలించేందుకు విచ్చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కాసేపు స్థానిక నాయకులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భోగాపురంలో నిర్మించదలచిన విమానాశ్రయానికి స్థానికుల సహకారం అవసరం ఎంతైనా ఉందన్నారు. విమానాశ్రయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిస్తే భవిష్యత్‌లో మంచి ఫలాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పడాల భానుప్రకాష్, ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, పడాల శ్రీనివాసరావు, కర్రోతు వెంకటరమణ, గరే మురళీమోహనరావు, కిలారి వెంకరమణ, దల్లి శ్రీనివాసరావు, పూడిక నూకరాజు, నడుపూరి సత్యనారాయణ, కొండపు కొత్తయ్యరెడ్డి, రిక్కా అప్పలనరసయ్య, సూరాడ చిన్నారావు, పతివాడ రామకృష్ణ, కొయ్య లక్ష్మణ్, దాసరి చంద్రశేఖర్, కొండపు రాజరెడ్డి, బైరెడ్డి రాజు, డీబీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శశిభూషణరావు

విజయనగరం: నగరంలోని తోటపాలెం సత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. విజయదుర్గ యూత్ సొసైటీ, విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధీరా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 50 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతం విద్యా సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధ్యాపకులు మీసాల సత్యవేణి, సూరప్పనాయుడు, విజయదర్గ యూత్ సొసైటీ అధ్యక్షురాలు చంద్రిక, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామష్, సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, పూర్ణ, సాయి, షణ్ముక, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు ప్రారంభం



నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నెల్లిమర్ల: ఎస్‌ఎఫ్‌ఐ 31వ జిల్లా మహాసభలు నెల్లిమర్లలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కార్మిక సంఘాల కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కార్మిక సంఘాల కార్యాలయం ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ, అటు దేశంలో ఇటు రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. ఒకపక్క నిరంకుశ విద్యావిధానాలతో విద్యార్థులను చదువుకు దూరం చేస్తూనే.. మరోపక్క చదువు చెప్పే ఉపాధ్యాయులు పట్ల కూడా ప్రభుత్వాలు కర్కశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలోఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సీహెచ్ పావని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి.రామ్మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నెల్లిమర్ల: పట్టణంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని నెల్లిమర్ల నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన నిర్వాహకుల ద్వారా ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి. త్రినాథ, మెప్మా సీఓ బి. పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి పోటీలు

విజయనగరం అర్బన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ నెల 19న జిల్లా స్థాయి వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ-కామర్స్ మరియు డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుని రక్షణ' అనే అంశంపై ఈ పోటీలు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ముందుగా పాఠశాల, మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆదివారం పాఠశాల స్థాయి పోటీలను నిర్వహించి ఎంపికైన విజేతలకు ఈ నెల 18న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 19న స్థానిక ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంపీపీ మామిడి అప్పలనాయుడు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రం తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు లేకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తలు నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు ఇంటికి తీసుకువెళ్లడం సరికాదన్నారు. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రం తెరిచి ఉంటుందని, లబ్ధిదారులు తప్పకుండా వచ్చి సరుకులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, బి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల పరిశీలన

కొండకరకాం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మార్కుల పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, బి.ఆదినారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వయెలిన్ కచేరి



కచేరీ నిర్వహిస్తున్న రామ్‌చరణ్

విజయనగరం టౌన్: పద్మశ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు జయంతి సందర్భంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై హెచ్.రామచరణ్ కచేరీని హృద్యంగా ఆలపించారు. మృదంగంపై పి.మెహర్‌సాగర్ సహకరించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎల్‌ఎన్ శాస్త్రి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతినాయుడు

విజయనగరం రూరల్: మండలంలోని 51 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డి.తిరుపతినాయుడు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొనడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నట్లు చెప్పారు. అలాగే పిల్లలను కేంద్రాలకు తీసుకువచ్చి, ఇంటి దగ్గర దింపే బాధ్యత వైఎస్సార్ క్రాంతిపథంలోని వీఓలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పీబీవీ రామచంద్రరాజు, ఏపీఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు భోజనం



భోజనం తింటున్న పిల్లలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఐసీడీఎస్, సచివాలయం సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని బీసీ కాలనీలో ఒకటి, మూడు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శనివారం దగ్గరుండి భోజనం పెట్టించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, హెచ్‌ఎం.సీతమ్మనాయుడు, ఎంఎస్‌కే నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

లింగ వివక్షతను వ్యతిరేకిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు సిబ్బంది, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు

బొండపల్లి: లింగ వివక్షతను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి అన్నారు. లింగ వివక్షతకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ లింగ భేదం చూపకుండా మగ, ఆడ పిల్లలను సమానం గా చూడాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అనంతరం మండలంలోని గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, బుక్ కీపర్లు, బ్యాంకు మిత్రలు తదితరులు కలిసి లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు.

21న భగవద్గీత శ్లోకపఠన పోటీలు

చీపురుపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని స్థానిక కొత్తగవిడివీధిలోని శ్రీ కృష్ణ మందిర ప్రాంగణంలో ఈనెల 21వ తేదీన భగవద్గీత శ్లోకపఠన పోటీలు నిర్వహించనున్నట్లు గీతాసత్సంగ్ సేవాశ్రమ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 21న మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94401 05279, 70327 60344 నంబర్లకు ఫోన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.